# దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

## త్రి సభ్య కమిటీతో తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ చర్చలు

- **ఉద్యోగులకు ఉత్తమమైన ఆరోగ్య పథకాన్ని అమలు చేయండి**
- **ఇంటిగ్రేటెడ్ హౌసింగ్ పాలసీని ప్రవేశపెట్టి అమలు పర్చండి**
- **ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయండి**
- **జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో కలిసిన ఉద్యోగ సంఘాలు**

**హైదరాబాద్, మే13(కెరటం న్యూస్)**

రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఎలాంటి ఆర్థిక భారం లేకుండానే పరిష్కరించాల్సిన అంశాలు చాలా ఉన్నాయన్నారు. సోమవారం తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రి సభ్య కమిటీ ఛైర్మన్ నవీన్‌మిట్టల్, ఇతర సభ్యులను కలిసి ఈనెల 6న జరిగిన తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కాంటిజెంట్ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిగణలోకి తీసుకుని ఆమోదించిన తీర్మానాలను మూడు విభాగాలుగా చేసి అత్యవసర, ఆర్థికేతర, ఆర్థిక సమస్యలు అధికారులకు వివరించడం జరిగింది. వీటితో పాటు ప్రధానంగా ఉద్యోగులందరికీ నగదు రహిత వైద్యం అందించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, నూతన పెన్షన్ విధానం(సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ (ఓపిఎస్) పునరిద్ధంచాలని, పొరుగు సేవల ఉద్యోగుల కొరకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, 317 జీవో ద్వారా మరి కొన్ని రకాల బదిలీలకు అవకాశం కల్పించాలని, ప్రభుత్వ ఖజానాపై తక్షణ భారం పడని 24 అంశాలను తొలుత పరిష్కరించి, ఆ తర్వాత మిగిలిన 14 పైగా ఆర్థిక భారం పడే అంశాలను దశల వారీగా పరిష్కరించాలని ప్రాతినిధ్యం చేయడం జరిగింది. వీటితో పాటు జేఏసీ భాగస్వామ్య సంఘాల ఉద్యోగుల ప్రత్యేక సమస్యల పట్ల ఆయా ప్రతినిధులు నివేదించడం జరిగింది. సానుకూలంగా స్పందించిన కమిటీ ప్రభుత్వంతో చర్చించి పరిష్కారం కొరకు కృషి చేయగలమని హామీ ఇచ్చారు.

అందులోని అంశాలు..



**అత్యవసర అంశాలు:**

- ★ ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్) ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించాలన్నారు.
- ★ ఉద్యోగుల సాధారణ బదిలీలను ప్రతి సంవత్సరం మే / జూన్ నెలల్లోనే చేపట్టాలన్నారు.
- ★ జీ.ఓ. నెం. 317 ప్రకారం దంపతుల బదిలీ, అనారోగ్య పరమైన ఇబ్బందులు వంటి కేసులకు అనుమతి ఇచ్చినందుకు గౌరవనీయ ముఖ్యమంత్రికి మరియు మంత్రిమండలి ఉపసమితి ఛైర్మన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, మిగిలిన అర్హులైనవారిని కూడా పరిగణించమని మనవి చేశారు.
- ★ జీ.ఓ. 317 ప్రకారం, అంతరజిల్లా దంపతుల కేసులను భవిష్యత్తులో ఖాళీల్లో పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అలాగే సీనియారిటీ ఆధారంగా ఇతర జోన్లు/జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగులను, వారు ముందుగా పనిచేసిన ప్రాంతాలలో భవిష్యత్‌లో వచ్చే ఖాళీల్లో తిరిగి తీసుకోవాలని కోరారు.
- ★ జీ.ఓ. నెం. 317 పోర్టల్‌లో ఒంటరి ఉద్యోగులకు ఎంపిక అవకాశాన్ని ఇవ్వాలన్నారు.
- ★ మల్టీజోన్-1 నుండి మల్టీజోన్-2కి (లేదా అప్‌రిట్) తిరిగి కేటాయింపులకు గో.ఓ. 317 పోర్టల్‌లో ఎంపిక అవకాశం కల్పించాలన్నారు.
- ★ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవలను శ్రేణీకృతం చేయడానికి, ఏజెన్సీలను తొలగించి హెచ్.ఆర్ పాలసీ అమలు చేయడానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. వీరికి హెల్త్ కార్డులు కూడా మంజూరు చేయాలన్నారు.
- ★ సాధారణ ఎన్నికల కారణంగా బదిలీ అయిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు మరియు ఇతర అధికారుల పునఃనియామకం తక్షణమే చేపట్టాలని కోరారు.

## ఆర్థికేతర సమస్యలు...

- ★ 61 సంవత్సరాలు దాటిన విఆర్‌ఏలకు అర్హత ఆధారంగా జీపీఓ పోస్టును ఎంచుకునే అవకాశం ఇవ్వాలని కోరారు.
- ★ అన్ని శాఖల్లో క్యాడర్ వారీగా ఖాళీలను వెంటనే భర్తీ చేసి, ప్రమోషన్ లేదా నేరుగా నియామకం ద్వారా నింపాలన్నారు.
- ★ ఉద్యోగులు తమ విధుల్లో నిబద్ధతగా ఉన్నప్పుడు ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు చేయరాదన్నిరు. సీఆర్‌పీఎస్ సెక్షన్ 197 (ప్రస్తుతం బిఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 218) ప్రకారం శాఖాధిపతి అనుమతి తప్పనిసరిగా ఉండాలనే నిబంధనను పాటించాలి కోరారు.
- ★ సేవలో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు తక్షణమే మంజూరు చేయాలన్నారు.
- ★ రెవెన్యూ శాఖ ఉద్యోగుల కోసం ప్రత్యేక శిక్షణ అకాడమీ స్థాపించాలని కోరారు.
- ★ ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్న దివ్యాంగులకు ప్రమోషన్‌లలో 4% రిజర్వేషన్ కల్పించాలన్నారు. అంగవైకల్య శాతం అర్హతను 70% నుండి 40%కి తగ్గించాలన్నారు.
- ★ దివ్యాంగుల శాతం మేరకు బదిలీల్లో వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.
- ★ టీచర్స్ ఎంఎల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు కల్పించాలన్నారు.
- ★ వైద్య రీయింబర్స్‌మెంట్ బిల్లుల మంజూరు పరిమితిని పెంచాలని, పెండింగ్ బిల్లులను త్వరగా క్లియర్ చేయాలని కోరారు.
- ★ ప్రస్తుతంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉన్న చికిత్స ధరలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య బెనిఫిట్ల రేట్లు సవరించాలన్నారు.
- ★ మల్టీజోన్-1 నుంచి మల్టీజోన్-11కి తిరిగి కేటాయింపు కోసం జీ.ఓ. 317 పోర్టల్‌లో ఎంపికను కల్పించాలన్నారు.
- ★ ప్రతి ప్రాథమిక పాఠశాలలో హెడ్‌మాస్టర్ పోస్టును మంజూరు చేయాలన్నారు.
- ★ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల నియమితీకరణ పరిగణించాలి.
- ★ అన్ని ప్రభుత్వ ఉద్యోగులకు వారి జిల్లాల కేంద్రాలలో లేదా నిర్ణీత ప్రదేశాలలో నివాస స్థలాలు (హౌస్ సైట్లు) ఇవ్వాలి.
- ★ జీపీఓకి ఎంపిక చేసుకున్న పూర్వ వీఆర్‌వోలు, వీఆర్‌ఏలను స్క్రీనింగ్ టెస్ట్ లేకుండా, గత సేవ ఆధారంగా నేరుగా నియమించాలని కోరారు.
- ★ రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు / టైపిస్టులు, హెచ్‌హెచ్‌పీలు, ఎఫ్‌టీఎస్‌కి గ్రామ పాలన అధికారి (జీపీవో)గా పనిచేసే అవకాశం ఇవ్వాలన్నారు.
- ★ అన్ని క్యాడర్ల ఉద్యోగులకు పరస్పర బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు.

- రూ.10 లక్షల లోపు బిల్లులను ఈ-కుబేర్ ద్వారా క్లియరెన్స్ చేయాలని కోరారు.
- ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్) ద్వారా క్యాష్‌లెస్ వైద్య చికిత్స అందించాలన్నారు.
- సాధారణ బదిలీలు మరియు సాధారణ ఎన్నికల సమయంలో బదిలీ అయిన అధికారుల పూర్వ జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు.
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు.
- సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) రద్దు చేసి, ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీమ్) పునరుద్ధరణ చేయాలన్నారు.
- జీఓ నెం. 317 ప్రకారం అర్హత కలిగిన అభ్యర్థులందరినీ పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

**ఆర్థిక సమస్యలు:**

- 01.01.2025 నాటికి పెండింగ్‌లో ఉన్న డియర్నెస్ అలౌయెన్సులను (డిఏ) బకాయిలతో సహా విడుదల చేయాలన్నారు.
- చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పేస్కేల్ సవరణ కమిషన్ నివేదికను తుది రూపుదిద్ది, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు పెన్షనర్లకు 51% ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలన్నారు.
- తెలంగాణలోని వివిధ శాఖల అధికారులకు కేటాయించిన వాహనాలకు సంబంధించిన పెండింగ్ హైరుచార్జీలను విడుదల చేయాలని కోరారు.
- హౌస్ బిల్డింగ్ అడ్వాన్స్, పండుగ అడ్వాన్స్ మొదలైన రుణాలు, అడ్వాన్సులను పెంచాలన్నారు.
- పదవీ విరమణ సందర్భంగా ఉద్యోగులకు అదే రోజున పెన్షనరీ లాభాలు చెల్లించాలని కోరారు.
- తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ కోసం అవసరమైన మౌలిక సదుపాయాలు, వార్షిక బడ్జెట్‌ను కేటాయించాలన్నారు.
- ఈఎల్ పై ఉన్న 300 రోజుల పరిమితిని 365 రోజుల వరకూ పెంచాలన్నారు.
- గ్రాడ్యూటీ మొత్తాన్ని కనీసం రూ. 20 లక్షలకు పెంచాలన్నారు.
- హెచ్‌ఆర్‌ఏ నగరాల్లో కనీసం 35%, జిల్లా కేంద్రాలు, మండల స్థాయిలో 30%గా నిర్ణయించాలని కోరారు.
- కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలి.
- సీపీఎస్ ఉద్యోగి మరణించిన సందర్భంలో, సీపీఎస్ నిధులలో నుంచి కట్ అయిన మొత్తాన్ని కుటుంబానికి తిరిగి చెల్లించాలి మరియు ఫ్యామిలీ పెన్షన్ మంజూరు చేయాలన్నారు.
- పీఆర్‌సీలో స్కూల్ అసిస్టెంట్లు మరియు ఎస్‌జీటీల మధ్య వేతన వ్యత్యాసాన్ని తగ్గించాలన్నారు.
- హైరుడ్ వాహనాల ఛార్జీలను నెలకు రూ. 33,000 నుండి రూ. 75,000 కు పెంచాలి.

**ఉద్యోగుల ఆరోగ్య పథకం**

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ – ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్) – రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వారి ఆధారిత కుటుంబ సభ్యులకు అన్ని రకాల వ్యాధులపై అంచనా లేని, క్యాష్‌లెస్, పూర్తి స్థాయి ఇంటిపేషంట్, అవుట్‌పేషంట్ చికిత్సను ప్రభుత్వ / ప్రైవేట్ ఎంపానెల్డ్ ఆసుపత్రుల్లో అందించేందుకు ఉద్యోగి, ప్రభుత్వం సమానంగా నెలవారీ చందా చెల్లించే విధంగా పునర్వ్యవస్థీకరణ చేయాలని కోరారు.

**ఎదుర్కొంటున్న ఇబ్బందులు:**

– ఉద్యోగులు, వారి కుటుంబాలు అత్యవసర వైద్యం కోసం రుణాలు తీసుకోవలసి వస్తోంది. చికిత్స అనంతరం కూడా పూర్తిస్థాయి రీయింబర్స్‌మెంట్ రావడం లేదు. ముఖ్యమైన శస్త్రచికిత్సలకు రూ.2లక్షల హద్దు ఉండటం, మరీ అధిక వ్యయాల బిల్లులకు సమీక్ష కమిటీ లేకపోవడం, ఆలస్యం వంటి సమస్యలు ఉన్నాయి.

–12 నెలలు నుంచి 21 నెలల వరకూ రీయింబర్స్‌మెంట్ ప్రక్రియ సాగుతుంది. ముఖ్యంగా జిల్లా ఉద్యోగులకు ఎక్కువ సమయం పడుతోంది. ఈ ఆలస్యాల వల్ల ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఒత్తిడికి లోనవుతున్నారు.

– ప్రస్తుత పీఆర్‌సి(2018) కూడా ఉద్యోగుల నుండి 1% ప్రాథమిక వేతనం చందాగా వసూలు చేసి, ఆరోగ్య సేవలు అందించాలని సిఫార్సు చేసింది. అయితే దీనిపై ఉద్యోగ సంఘాలలో విభేదాలు ఉన్నాయి.

**సూచనలు:**

–ఉద్యోగి కుటుంబ సభ్యుల సంఖ్య, వయస్సు, అదనపు సేవలు వంటి అంశాల ఆధారంగా ఫిక్స్‌డ్ చందా విధానం అనుసరించాలి. ఆప్షనల్ సేవలకు కూడా విభజించవచ్చు.

– 2014-15 నుండి 2022-23 వరకు ప్రభుత్వం అందించిన మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఖర్చు రూ. 160 కోట్ల నుండి రూ. 467 కోట్ల వరకు పెరిగింది. ఇది నెలకు సగటు రూ. 40 కోట్లు అవుతుంది.

– ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 6 లక్షల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఉన్నారు. వీరిలో చాలా మంది ఆరోగ్య పథకానికి నెలవారీ చందా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రాథమిక కార్డ్ హోల్డర్ పేస్లిప్ ద్వారా చందా వసూలు చేయాలి. అదే మొత్తాన్ని ప్రభుత్వం కూడా చెల్లించాలి.

– పై కారణాలన్నింటిని పరిగణనలోకి తీసుకుని, ప్రభుత్వం “క్యాష్‌లెస్, ఎండ్-టు-ఎండ్” చికిత్స పథకాన్ని ప్రకటించాలని మనవి చేస్తున్నాము. దీనిలో ఇంటిపేషంట్, అవుట్‌పేషంట్, డయగ్నాసిస్, శస్త్రచికిత్స, పోస్ట్ ఆపరేటివ్ కేర్, మందులు వంటి అన్నింటినీ హెల్త్ కార్డ్ ప్రదర్శన ద్వారా పొందేలా చేయాలి.

– ఈ ప్రతిపాదనపై వివిధ ఉద్యోగ సంఘాలతో చర్చించి తుది ముసాయిదాను రూపొందించాం. దయచేసి దీనిపై అనుకూల నిర్ణయం తీసుకోవాలని వినమ్రంగా కోరుతున్నాము.

**ఇంటిగ్రేటెడ్ హౌసింగ్ పాలసీ**

తెలంగాణ ప్రభుత్వంలో ప్రస్తుతం సుమారు 10 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో దాదాపు 5లక్షల మంది ఉద్యోగులు ప్రభుత్వ గృహ సంక్షేమ పథకాల ప్రకారం స్థలాల కోసం అర్హులుగా ఉన్నారు. దీనిని సంక్షేమ అవసరంగా మాత్రమే కాకుండా, స్ట్రాటజిక్ ఆర్థిక వనరుల సేకరణ అవకాశంగా పరిగణించి, ఒక సమగ్ర హౌసింగ్ పాలసీ ప్రతిపాదించబడింది.

**ప్రాజెక్ట్ విజన్:**

అర్హులైన ప్రభుత్వ ఉద్యోగులకు కనీస ఖర్చుతో, సక్రమంగా ప్రణాళికాబద్ధమైన హౌసింగ్ వసతులు కల్పించడం.

ఈ వసతులను పట్టణ విస్తరణకు ఆదర్శంగా మార్చడం.

ఉద్యోగుల స్వీయ ఆర్థిక సహకారంతో (సెల్ఫ్ ఫైనాన్సింగ్) అమలు చేసి ప్రభుత్వంపై ఆర్థిక భారం లేకుండా పెద్దఎత్తున ఆదాయం సృష్టించడం.

వ్యూహాత్మక పట్టణ ప్రణాళిక – ఫేజ్ 1: హైదరాబాద్ పరిధిలో..

**భూభాగం:** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో 5,000 ఎకరాలు అభివృద్ధి చేయడం.

**లక్ష్య ఉద్యోగులు:** హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పనిచేసే 50,000 మంది ఉద్యోగులు.

**అభివృద్ధి విధానం:**

–ప్రైవేట్/కార్పొరేట్ మాదిరిగానే మార్కెట్ విలువ ఆధారంగా భూముల సేకరణ.

–ఉద్యోగుల నుండి భూమి, మౌలిక వసతుల అభివృద్ధి వ్యయాలపై సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానం.

–ప్రపంచ స్థాయి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పాఠశాలలు, ఆసుపత్రులు, పబ్లిక్ స్పేసెస్‌తో కూడిన నగరాల ప్రణాళిక.

**ఫేజ్-1లో ఆశించే ఆదాయం:**

–ప్రతి ప్లాట్‌కి సగటు విరాళం రూ. 10 లక్షలు అని భావిస్తే:

–70,000 ఉద్యోగులు ఐ రూ. 10 లక్షలు = రూ. 7,000 కోట్లు

–రిజిస్ట్రేషన్, ల్యాండ్ డెవలప్‌మెంట్ చార్జీలు, ట్యాక్సుల ద్వారా అదనంగా రూ. 3,000 కోట్లు

–మొత్తం రాష్ట్రానికి నేరుగా రూ. 10,000 కోట్లు ఆదాయం

**పట్టణ అభివృద్ధికి ప్రోత్సాహం:**

–ఈ టౌన్‌షిప్‌లు ప్రైవేట్ పెట్టుబడులు, విద్యా సంస్థలు, సేవల విభాగాలన్నింటినీ ఆకర్షిస్తాయి.

–ఉద్యోగులు నివసించడంతో జీవనోపాధిపై ఆధారిత వ్యవస్థలు పుట్టుకొస్తాయి.



–నగర కేంద్రంలో భారం తగ్గించి, సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి దోహదం చేస్తుంది.

**ఫేజ్ 2 - రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ:**

–అన్ని జిల్లా కేంద్రాలు, ముఖ్యమైన పట్టణాలలో మోడల్‌ను పునరావృతం చేయాలి.

–అభివృద్ధి ప్రాంతాల సమీపంలో భూములు గుర్తించి సేకరించాలి.

–మిగిలిన 4.5 లక్షల అర్హులైన ఉద్యోగులను లక్ష్యంగా పెట్టుకోవాలి.

–రూ. 5 లక్షల సగటు విరాళంతో రాష్ట్రవ్యాప్తంగా ఆదాయం :

–4.5 లక్షల ఉద్యోగులు ఐ రూ.5 లక్షలు = రూ. 2.25 లక్షల కోట్లు

–ప్రభుత్వానికి ట్యాక్సుల రూపంలో రూ. 30,000 – 40,000 కోట్లు ఆదాయం

**ప్రభుత్వానికి లాభాలు :**

1. ఉద్యోగుల సహకారంతో భారీ వనరుల సమీకరణ
2. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలకు ఉత్సాహం
3. ప్రాపర్టీ ట్యాక్స్, స్టాంప్ డ్యూటీ ద్వారా ఆదాయం
4. ఉద్యోగుల సంతృప్తి, రిటెన్షన్ మెరుగవుతుంది
5. వేగవంతమైన పట్టణ మౌలిక వసతుల విస్తరణ
6. కార్పొరేట్ సంస్థలు కొత్తగా హబ్‌లలో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపుతాయి

**అమలు మెకానిజం :**

–తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల హౌసింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి లేదా ఇప్పటికే ఉన్న సంస్థల ద్వారా అమలు చేయాలి.

–ప్రతి జిల్లాలో ఒక నోడల్ అధికారి నియమించాలి %–% ల్యాండ్ మరియు లబ్ధిదారుల సమన్వయం కోసం.

–ఆన్లైన్ ద్వారా పారదర్శకంగా నమోదును, చందా వసూళ్లను నిర్వహించాలి.

–ప్రముఖ ప్రణాళికదారులు, ఇన్‌ఫ్రా సంస్థలతో భాగస్వామ్యం ఏర్పాటు చేయాలి.

–ఈ హౌసింగ్ పాలసీ ఒక సంక్షేమ పథకానికి మించి, ఒక దూరదృష్టి గల ఆర్థిక వ్యూహం. ఇది ఉద్యోగులకు మెరుగైన జీవితాన్ని, ప్రభుత్వానికి స్వయం సహాయక ఆదాయాన్ని, మరియు పట్టణాల ప్రణాళికా అభివృద్ధికి దోహదం చేస్తుంది.

–ఫేజ్–1 అమలుకు అనుమతించి, ఇతర జిల్లాలలో విస్తరణపై అధ్యయనం చేయడానికి టాస్క్ ఫోర్స్ నియమనాన్ని కూడా అభ్యర్థిస్తున్నాము.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు

– తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు – ప్రైవేట్ ఏజెన్సీలను తొలగించి, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

- తెలంగాణలో దాదాపు 2 లక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గ్రామ పంచాయతీ స్థాయి నుండి హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ కార్యాలయాల వరకు వివిధ శాఖలు, సొసైటీలు, కార్పొరేషన్లలో తక్కువ జీతాలతో పనిచేస్తున్నారు.
- వీరు రెగ్యులర్ ఉద్యోగులతో సమానమైన పని భారాన్ని భరిస్తున్నా, నియామక ఏజెన్సీలు వీరి జీతాల బిల్లులను ప్రభుత్వానికి సమర్పించి, చెల్లింపులు ఆలస్యంగా చేస్తూ ఉద్యోగులను ఇబ్బందిపెడుతున్నాయి.
- ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి మూడవ పక్ష నిధులను ప్రభుత్వమే చెల్లిస్తున్నా, ఏజెన్సీలు వాటిని ఉద్యోగుల ఖాతాలలో మించకుండా నెలల తరబడి నిలిపివేస్తూ తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి.
- ఉద్యోగ భద్రత లేకుండా, హెచ్ఆర్ పాలసీ లేకుండా, ఏజెన్సీలు అవాంఛనీయంగా ఒత్తిడి తెచ్చే పరిస్థితి ఉంది. కొంతమంది ఉద్యోగులు తక్కువ జీతాలతో మానసిక ఒత్తిడికి లోనై మృతిచెందిన ఉదంతాలు నమోదయ్యాయి.

**ప్రధాన ప్రతిపాదనలు:**

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాదిరిగా, తెలంగాణలో కూడా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి. అందులో ప్రైవేట్ ఏజెన్సీలను రద్దు చేయాలి.
- ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులందరినీ ఆ కార్పొరేషన్‌లో కొనసాగిస్తూ, ప్రతి నెల 5వ తేదీలోపు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.
- కాంట్రాక్టు విరమించాల్సి వచ్చిన ఉద్యోగులకు పరిహారం ఇవ్వాలి.
- సేవలో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసి, వారసులకు కనికర నియామకాలు ఇవ్వాలి. ఇందుకోసం ప్రతి ఉద్యోగి నుంచి నెలకు రూ.100 చందా వసూలు చేయవచ్చు.
- ప్రతి ఉద్యోగికి వార్షికంగా రూ.1000 పెరుగుదల ఇవ్వాలి. దీన్ని కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఆధారంగా పెంచాలి.
- ప్రభుత్వ నియామకాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వెయిటేజ్ మార్కులు ఇవ్వాలి.
- సెలవులు 15 నుండి 30కి పెంచాలి, అలాగే మహిళా ఉద్యోగులకు పెయిడ్ మటర్నిటీ లీవ్ మంజూరు చేయాలి.
- పెండింగ్‌లో ఉన్న జీతాల చెల్లింపును ప్రాధాన్యతతో పూర్తిచేయాలి.
- హెచ్ఆర్ పాలసీ రూపకల్పన చేసి అమలు చేయాలి.
- రాష్ట్రవ్యాప్తంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డేటాను కేంద్రీకృతంగా నిర్వహించడం.
- నియామక ప్రక్రియను కేంద్రీకరించి ఏజెన్సీల జోక్యాన్ని తొలగించడం.
- జీతాల చెల్లింపులో పారదర్శకత, సదుపాయాల అమలు.
- ఫలితాలకులేని, పని చేయని ఫిర్యాదు పరిష్కార వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా సమర్థవంతమైన మెకానిజాన్ని ఏర్పాటు చేయడం.

ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కె.రామకృష్ణ, డా.నిర్మల, ఎస్.రాములు, బాణాల రాంరెడ్డి, రమేష్ పాక, హన్మంతరావు, సీపీఎస్ దర్శన్ గౌడ్, సాల్మన్ నాయక్, శశిధర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, రవికుమార్, చంద్రశేఖర్ గౌడ్, హరి కిషన్, వెంకట్, గోపాల్, హబీబ్ మస్తాన్, లక్ష్మయ్య పులి, హేమలత, సుగంధిని, తదితరులు పాల్గొన్నారు.